సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



శివస్వాముల శోభాయాత్ర

వేములవాడ: మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ పురవీధుల్లో శివస్వాములు గురువారం శోభాయాత్ర నిర్వహించారు. ఓం నమఃశివాయ ధ్వనులతో వీధులు మార్మోగాయి.



జిల్లా ఆస్పత్రిలో సదెరం శిబిరం

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలో గురువారం దివ్యాంగుల గుర్తింపునకు సదెరం శిబిరం నిర్వహించారు. 39 మందికి వైద్యులు పరీక్షలు చేసినట్లు ఆస్పత్రి సూరింటెండెంట్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి పెరుగుతుంది.



అప్పటి జాతరే వేరు!

- శివరాత్రి జాతరపై నాటి పెద్దల ముచ్చట్లు
- ఎడ్లబండ్లపై రాక.. పది రోజుల ప్రయాణం
- మూడు నాలుగు రోజులు ఆ సంబరమే వేరు..



నాటి రాజన్న గుడి

వేములవాడ: మహాశివరాత్రి పండుగకు రెండు రోజుల ముందే ముల్లె..మూట సర్దుకుని ఎడ్ల బండ్లను సిద్ధం చేసుకుని కుటుంబంతో సహా రాజన్న దర్శనానికి బయలుదేరేవాళ్లు. మూడు కమాన్ల వద్ద ఎడ్లబండ్లను నిలిపి.. కాలినడకన వచ్చి గుండంలో స్నానం చేసి.. రాజన్నకు మొక్కులు చెల్లించేవాళ్లు. మళ్లీ ఎడ్లబండ్లవద్దకు చేరుకుని జాగరణ దీపం వెలిగించేవాళ్లు.. నాటి వైభవం.. పేదల దేవుడు.. రైతులపాలిట అన్నదాతగా నాడు.. నేడు కొలువబడుతున్న ఎములాడ రాజన్న సన్నిధిలో నాటి నుంచి నేటి వరకు జరుగుతున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాలపై నాటి తరం జాతరపై అప్పటి వారి అనుభవాలతో 'సాక్షి' పాఠకులకు అందిస్తున్న ప్రత్యేక కథనం..




- ఈ ఫొటోలో కనిపిస్తున్న పెద్దాయన పెద్ది నారాయణ. ఈయనది వేములవాడ. వయస్సు 95ఏళ్లు. చిన్నతనంలో జాతర ఉత్సవాలపై ఇలా చెబుతున్నారు. జాతర గ్రౌండ్‌లో అన్ని పొలాలే ఉండేవి. కచ్రాలపై భక్తులు రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే వారు. మూడు కమాన్లు ఉండేవి. ఈ కమాన్ల వద్ద నుంచి గుడికి నడిచి వెళ్లే వాళ్లు. నయాపైసా, సత్తు పైసా, ఇత్తడి పైసా, నవాబుపైసాలతో రైతులు కొనుక్కునే వారు. నాటి జాతర సంబరమే వేరు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి లైశెట్టి మల్లేశం. వీరిది వేములవాడ. రైతు కుటుంబంలో పుట్టారు. నాడు ఇంతమంది జనం వచ్చేవారు కాదనీ, గంగ అవతలి వాళ్లు వచ్చేవారనీ, ఎండ్లబండ్లపై పది రోజులపాటు ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుని దర్శనాలు ముగించుకుని మళ్లీ ఎడ్లబండ్లపైనే తిరిగి వెళ్లేవారు. అప్పుడు గుండానికి తంతెలు లేవు. చెరువు, గుండం కలిసే ఉండేవి. చెరువు నీళ్లు తియ్యగా ఉండేవి. కచ్రాలపై చేరుకుని చుట్టూ కచ్రాలు నిలిపి మధ్యలో దీపాలు పెట్టుకుని జాగరణ చేసేవాళ్లు. అప్పుడు చారానాకు కొబ్బరికాయ దొరికేది.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి దొర బాలయ్య. చిన్ననాటి నుంచి ఇప్పటి వరకు జాతరలు చూస్తూనే ఉన్నారు. నాటి జాతరలో కట్టకింద నుంచి లక్ష్మీపూర్ వరకు ఎండ్ల బండ్లు నిలిచేవి. రోడ్లు సరిగా లేవు. కాలినడకనే ఎక్కువ. అప్పటి జాతర సంబురం ఇప్పుడు లేదు. జాతరకొస్తే కనీసం మూడు నుంచి నాలుగు రోజులు ఉండే వారు. గాంధీనగర్‌లో గొంగళ్లు తీసుకొచ్చి గొల్లోళ్లు అమ్ముకునే వారు. వీటిని మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ఇక్కడి నుంచి కొనుక్కుని వెళ్లేవాళ్లు.



నాటి రాజన్న గుడి ముందు భాగం



నాటి ధర్మగుండం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వొజ్జల రాజన్న అర్చకులు. ఇతను 1977 నుంచి మొన్నటి వరకు ఆలయంలో అర్చకుడిగా పని చేశారు. నాటి భక్తి నేడు లేదని చెబుతున్నారు. అప్పుడు భక్తుల రద్దీ తక్కువగా ఉండేది. ఈజీగా దర్శనాలు జరిగేవి. అప్పుడున్న ప్రశాంతత ఇప్పుడు లేదు. అంతా ఆర్టిఫిషియల్‌గా మారింది. గర్భగుడి ముందు ఓ చెక్కను అడ్డంగా పెట్టేవాళ్లు. వీఐపీలు వస్తే చెక్కను జరిపి గర్భగుడిలోకి తీసుకెళ్లి దర్శనాలు చేయించేవాళ్లం. ప్రాతఃకాల పూజ అయ్యే వరకు గుడి తలుపులు తీయకపోయేది. రూ.25కే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించేవాళ్లం. రూ.11కు ఏకవారాభిషేకం, రూ.10 కోడె టికెట్టు. మొలుగుకు చెందిన ఆర్యవైశ్యులు ధర్మశాల కట్టించారు. మానుకోట లంబాడాలు ప్రతిఏటా 20 నుంచి 30 కోడెలు తీసుకొచ్చి రాజన్నకు సమర్పించేవాళ్లు.

అప్పుడు తక్కువ మంది వచ్చేవాళ్లం



15 ఏళ్ల నుంచి కల్యాణకట్టకు వెళ్తున్న. చిన్నతనంలో కచ్రాల్లో వచ్చి జాగరణ పూర్తయిన తర్వాతనే తలనీలాలు తీసుకునే వాళ్లు. అప్పుడు మేం కూడా చాలా తక్కువ మంది వచ్చేవాళ్లం. యాత్రికులు కూడ చాలా తక్కువ వచ్చేవారు. గుడారాల్లో, పందిళ్ల, చీరలు అడ్డం కట్టుకుని జాతరా గ్రౌండ్‌లోనే ఉండేవాళ్లు. కత్తెర్లు తీస్తే మాకు చారానా ఇచ్చేవాళ్లు.

– సాగారం భూమయ్య, నాయీబ్రాహ్మణుడు

న్యూస్‌రీల్

జాతరకు లడ్డూలు సిద్ధం



వేములవాడ: రాజన్న మహాజాతరకు హాజరయ్యే భక్తులకు స్వామివారి ప్రసాదాలు అందుబాటులో ఉండేందుకు 3 లక్షల లడ్డూలు సిద్ధం చేసి ఉంచుతున్నట్లు ఏఈవో ప్రతాప నవీన్ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం వరకు పూర్తిగా లడ్డూలు సిద్ధం చేసి ఉంచుతామని, జాతర ఒక్కరోజునే సుమారు రెండున్నర నుంచి మూడు లక్షల లడ్డూలు విక్రయం జరుగుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. లడ్డూల విక్రయాలను బట్టి తిరిగి లడ్డూలు సిద్ధం చేసి ఉంచుతామని చెబుతున్నారు. భక్తులకు సరిపడా లడ్డూలను తప్పకుండా సరఫరా చేస్తామన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సిరిసిల్లక్రైం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పోలీసులపై దాడికి దిగి, జనజీవన విధానానికి ఆటంకం కలిగించిన ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చట్టపరిధి దాటి ప్రవర్తిస్తే కేసు నమోదు జరుగుతుందని, శాంతి భద్రతల పరిరక్షణలో పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. దాడి చేసిన కేసులో రిమాండ్ వెళ్లిన వారిలో కేదవాత్ సుధాకర్, భుక్య మల్లికార్జున్, లకావాత్ తిరుపతి, మాలోతు సుధాకర్, మాలోతు ప్రకాష్, అజ్మీర రాజు,భుక్య సురేష్, బానోత్ రాజు ఉన్నట్లు తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు



సిరిసిల్ల: జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. వేములవాడలోని వెంకట్ ఈఎన్‌టీ ఆస్పత్రి, మహాలక్ష్మీ డెంటల్, భవానీ స్కిన్ అండ్ హెయిర్ ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ పత్రాలు, డాక్టర్ల సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు ఆస్పత్రుల్లో వసతులు ఉన్నాయనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీల్లో డిప్యూటీ డీఈఎంవో సంతోశ్, హెచ్‌ఈవోలు బాలయ్య, జలపతి, మహేశ్‌లు పాల్గొన్నారు.

ఎగువ మానేరు కాలువల పరిశీలన

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు సాగు నీటి కాలువలను ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సీఈ శంకర్, ఎస్‌ఈ శివకుమార్ గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, ఉప కాలువల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాలువల లీకేజీల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, డీఈ నర్సింగ్, నాయకులు పాల్గొన్నారు.

జాతరకు వెళ్లొద్దాం..!

- ఎములాడ రాజన్న సన్నిధిలో నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- రూ.3.70 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు
- మూడు లక్షల మంది వస్తారని అంచనా



వేములవాడ: తెలంగాణ జిల్లాల్లోనే పేదల దేవుడిగా.. ఎముడాల రాజన్న ప్రసిద్ధి చెంది దక్షిణ కాశీగా వెలుగొందుతోంది. రాజన్న సన్నిధిలో ఈనెల 17 నుంచి 19 వరకు మహాశివరాత్రి జాతర మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా 3 లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. జాతర ఉత్సవాలను రూ. 3.70 కోట్లతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేములవాడకు చేరుకునే ఐదు ప్రధాన రహదారుల్లో భక్తులకు స్వాగతం పలికేందుకు భారీ స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు.

స్థల పురాణమిదీ..

ఈ క్షేత్రంలో స్వామి వారి లింగరూపుడై గర్భగుడిలో భక్తులకు దర్శనమిస్తాడు. గుడికి సంబంధించిన అనేక పురాతన గాథలున్నాయి. పూర్వం నారద మహాముని భూలోకంలో సంచరిస్తూ పాపాలతో బాధపడుతున్న జనాన్ని చూసి వారికి విముక్తి కలిగించేందుకు పరమశివున్ని వేడుకోగా స్వామి కాశీలో శివుడు ఉద్భవించినట్లు చెబుతుంటారు. అక్కడ శివుడు సంతృప్తి చెందక వేములవాడకు చేరుకున్నాడని, శివుని వెంట భాస్కరుడు వచ్చాడని ప్రతీతి. అందుకే ఈ క్షేత్రాన్ని భాస్కర క్షేత్రంగానూ హరిహర క్షేత్రంగా పిలుస్తారు.

రాజన్న చెంతకు చేరుకోవడం ఇలా..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 150 కిలోమీటర్లు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రానికి 32 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. హైదరాబాద్ నుంచి వచ్చే వారు సిద్దిపేట ద్వారా, వరంగల్ నుంచి వచ్చే వారు కరీంనగర్ మీదుగా వేములవాడకు చేరుకునే రోడ్డు మార్గం ఉంది. సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి ప్రతీ అరగంటకు, కరీంనగర్ నుంచి పది నిమిషాలకో బస్సు సౌకర్యం ఉంది. రైల్వే సౌకర్యం లేదు. పెద్దపల్లి, వరంగల్, కామారెడ్డి ద్వారా రైల్వే మార్గంలో వేములవాడకు చేరుకోవచ్చు. దాదాపు 800 బస్సులను ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. 15 ఉచిత బస్సులు నడిపించనున్నారు.

కోడె మొక్కు విశిష్టత..

సంతాన లేని దంపతులు ఈ ఆలయంలో కొడుకు పుడితే కోడె కట్టేస్తా రాజన్నా అంటూ మొక్కుకుంటారు. సంతానం కలిగిన అనంతరం స్వామి వారికి కోడె మొక్కు చెల్లించుకుంటారు. వ్యవసాయం బాగుండాలని మొక్కుకునే రైతుల సంఖ్య అధికంగానే ఉంటుంది. తమ పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్న రైతులు తమ ఇంటివద్ద పెంచి పెద్దచేసిన కోడెలను (నిజకోడె) స్వామి వారికి అప్పగించి మొక్కులు తీర్చుకుంటారు. కోడెలను కట్టేసే ఆచారం ఇక్కడి ప్రత్యేకత. ఆలయంలోని గర్భగుడి సమీపంలో మతసామరస్యానికి ప్రతీకగా దర్గా ఉంది.

ఉచిత భోజనం.. తాగునీటి సౌకర్యం

జాతర సందర్భంగా మూడురోజుల పాటు స్థానిక ట్రస్టుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి కాంప్లెక్సులో ఉచితంగా భోజన సౌకర్యం, పార్వతీపురంలోని అన్నదానసత్రంలో ఉచిత భోజన వసతి కలదు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు 6 లక్షల నీటి పాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఆరు రాజన్న జలప్రసాదాల సెంటర్లు అందుబాటులో ఉంచుతున్నారు.

అత్యవసర సేవలు

- ఆలయం ఎదుట పోలీస్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు.
- నిరంతరం పోలీసు గస్తీ బృందాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అందుబాటులో ఉంచారు.
- ఆలయం ముందున్న అమ్మవారి కాంప్లెక్స్‌లో తాత్కాలిక వైద్యశాల.
- పార్కింగ్ స్థలాలు, వసతి గదుల వద్ద నిరంతరం వైద్య సేవలు.
- వీటిని పర్యవేక్షించేందుకు ఒక స్పెషల్ ఆఫీసర్‌తో పాటు 13 మంది నోడల్ ఆఫీసర్ల నియామకం.
- వీటితోపాటుగా మొబైల్ అంబులెన్స్, ఫైర్ సేవలు అందుబాటులోకి తెచ్చారు.
- 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు.

అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి



పెట్రోల్ బంక్‌ని ప్రారంభిస్తున్న స్వాతిలక్రా

సిరిసిల్లఅర్బన్: అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని టీఎస్‌ఎస్పీ బెటాలియన్ అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా అన్నారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 17వ పోలీస్ బెటాలియన్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ని ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఇంధనాన్ని అందించాలన్నారు. అనంతరం డయాస్, రినోవేటేడ్ గెస్ట్‌హౌస్‌లను ప్రారంభించి, నిర్మాణంలో ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్స్, కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ పనులను పరిశీలించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. క్రమశిక్షణకు టీఎస్‌ఎస్పీ మారు పేరు అని అన్నారు. నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం,అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి, డీఎస్పీ విశ్వప్రసాద్, ఇండియన్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు రోషన్ సవాయి, శ్రీనివాసన్, టౌన్ సీఐ అనిల్‌కుమార్, బెటాలియన్ ఏవో శైలజ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణకు కృషి చేయాలి



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూగర్భ జలాలు పెంపొందిస్తూ, నీటి వనరుల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాతీయ నీటి అవార్డుల పరిశీలన బృందం సభ్యుడు డాక్టర్ సురేందర్‌కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, హరిదాస్‌నగర్‌తో పాటు మండల పరిషత్ కార్యాలయంలోని నీటిట్యాంకులు, ఫీడర్‌చానల్, వర్షపు నీటి నిర్వహణ, వినియోగం, ప్రయోజనాలు, భూగర్భజలాల పెంపు పనులను పరిశీలించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలన్నారు. నీటిట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈఈ ఫ్రాంక్లిన్, అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో చిరంజీవి, ఏపీవో కొమురయ్య, సర్పంచులు శంకర్, అమృత, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుదల భేష్

ముస్తాబాద్(సిరిసిల్ల): కాళేశ్వరం ప్రాజెక్టుతో గొలుసుకట్టు చెరువులు నింపేందుకు చేపట్టిన భూగర్భ జలాల పెంపుదల పనులు బాగున్నాయని కేంద్ర జల వనరులు, భూగర్భ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్ కుమార్, ఈఈ ఫ్రాంక్లిన్ అన్నారు. జలవనరుల పెంపుదలపై కేంద్రం ఇచ్చే అవార్డుల ఎంపిక కోసం గురువారం ముస్తాబాద్, నామాపూర్‌లలో పర్యటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ముస్తాబాద్ మండలంలో అనేక చెరువులను నింపడం చూశామన్నారు. అధికారుల పనితీరు బాగుందన్నారు. పీడీ మదన్‌మోహన్, ఎంపీడీవో రమాదేవి, ఏఈ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పల్లె రోడ్లపై పట్టింపేది?

- 'ఇది తంగళ్లపల్లి మండలంలోని మధ్య మానేరు ముంపు గ్రామాలైన చీర్లవంచ, చింతలఠాణా గ్రామాలకు వెళ్లే ఏకైక రహదారి. ఈ రోడ్డు పొడవునా తారు చెదిరిపోయింది. ఈ రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు హడలిపోతున్నారు. పంచాయతీరాజ్ ఆధీనంలోని ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నా.. కనీసం మరమ్మతు చేయాలనే ఆలోచన అధికారులకు, ఇంజినీర్లకు లేక పోవడం దారుణం. ఆ రెండు గ్రామాల వాసులు జిల్లా కేంద్రమైన సిరిసిల్లకు రావాలంటే ఈ ఒక్క మార్గమే దిక్కు కావడంతో అష్టకష్టాల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు.'





'రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ నుంచి ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఇది. ఈ రోడ్డు 2015లో వేశారు. ఎనిమిది ఏళ్లుగా ఎలాంటి మరమ్మతు చేయకపోవడంతో రోడ్డు మొత్తం గొయ్యిలు పడి పెద్ద పెద్ద గోతులతో ఉంది. వాహనదారులు ఈ మార్గంలో వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగి రోడ్డు ఎక్కేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇది పంచాయతీరాజ్ ఆధీనంలోని రోడ్డు కావడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు.'

జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్ల స్వరూపం..

జిల్లాలో గ్రామాలు	255
మొత్తం గ్రామీణ రోడ్లు	528
పల్లె రోడ్ల పొడవు	1464.42 కిలోమీటర్లు
అంతర్ జిల్లా రోడ్డు పొడవు	28.50 కిలోమీటర్లు
అంతర్ మండలాల రోడ్ల పొడవు	31.57కిలోమీటర్లు
ఊరి నుంచి మరో ఊరి రోడ్డు పొడవు	1404.35 కిలోమీటర్లు
సిమెంట్ రోడ్లు	117.03 కిలోమీటర్లు
తారు రోడ్లు	538.0కిలోమీటర్లు
కంకర రోడ్లు	69.63 కిలోమీటర్లు

- తారు చెదిరినా.. గుంత పడినా అంతే
- నిధులున్నా ముందుకు సాగని పనులు
- ఇదీ జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్ల దుస్థితి

సిరిసిల్ల: రోడ్ల ప్రగతికి బాటలు.. ఊరికి విశాలమైన రోడ్డు ఉంటే.. అభివృద్ధి ఫలాలు వేగంగా దరిచేరుతాయి. అన్ని పనులు సులభమవుతాయి. కానీ, జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని పల్లె రహదారులు తారు చెదిరిపోయి.. గుంతలు పడినా పట్టించుకునేవారు కరువయ్యారు. గతేడాది కురిసిన వర్షాలకు పల్లెల రోడ్లు అధ్వాన్నంగా మారాయి. పాడైన రోడ్లతో పల్లె ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదు. చెడిపోయిన ఆ రోడ్లపై తట్టెడు మట్టికూడా పోయకపోవడంతో జనం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కనీస నిర్వహణ లేని ఆ రోడ్లతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు.

నిధులున్నా.. జరగని పనులు..

జిల్లాలోని తంగళ్లపల్లి నుంచి లక్ష్మీపూర్ మీదుగా ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ వరకు 15 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై పథకంలో రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 3.75 మీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 5.5 మీటర్లకు విస్తరించి తారు రోడ్డు వేయాల్సి ఉంది. కానీ నిధులు మంజూరై ఆరు నెలలైనా పనులు జరగడం లేదు. ఈ పని చేసేందుకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా పూర్తయింది. కానీ చెడిపోయిన ఈ రోడ్డును వేయించే సమయం, ఓపిక అధికార పార్టీ నాయకులకు, ఇంజినీరింగ్ అధికారులకు లేదు. ఫలితంగా ఆ మార్గంలోని లక్ష్మీపూర్, చీర్లవంచ, చింతలఠాణా, ఒబులాపూర్, వెల్జిపూర్, రహీంఖాన్‌పేట గ్రామాల వాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బందవుతోంది



మా ఊరికి రాత్రి పూట వెళ్లేందుకు ఇబ్బందవుతోంది. గుట్టల మధ్య నుంచి చీర్లవంచకు వెళ్లాలి. ఈ మార్గంలో చిరుతపులి సంచారం ఉండడంతో భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు బాగు లేక అడుగడుగునా గోతులు ఉండడంతో ప్రమాదకరంగా ఉంది. వెంటనే అధికారులు తారురోడ్డు వేయాలి.– జక్కుల రవీందర్, సర్పంచ్, చీర్లవంచ

రోడ్డు పూర్తిగా పాడైంది



మా ఊరి నుంచి వెల్జిపూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా పాడయింది. మేం పొలాల వద్దకు వెళ్లేందుకు ఆ రోడ్డు ఎక్కితే అన్నీ గోతులే ఉన్నాయి. చాలా వాహనాలు ఈ మార్గంలో వెళ్లి వస్తుంటాయి. ఇల్లంతకుంట నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఆరెపల్లి బాబు, లక్ష్మీపూర్, యువకుడు

వెల్జిపూర్ రోడ్డు పనులు ప్రారంభిస్తాం



తంగళ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ వెళ్లే రోడ్డును విస్తరిస్తాం. తారు రోడ్డును వేస్తాం. ఇప్పటికే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లను కోరాం. తంగళ్లపల్లి–వెల్జిపూర్ రోడ్డును పూర్తిస్థాయిలో 15 కిలోమీటర్ల రోడ్డును నిర్మిస్తాం. తొందరలోనే పనులు ప్రారంభిస్తాం.

– సూర్యప్రకాశ్, ఈఈ, పంచాయతీరాజ్

క్లుప్తంగా

మిడ్‌మానేరుపై సీఎం కేసీఆర్ ఏరియల్ వ్యూ



బోయినపల్లి(వేములవాడ): బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్.. పర్యటన అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యమానేరును (శ్రీ రాజరాజేశ్వర జలాశయాన్ని) హెలిక్యాప్టర్ ఏరియల్ వ్యూలో పరిశీలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



బాధితుడితో మాట్లాడుతున్న ఏఎస్సై

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన నడిగొట్టు కిష్టయ్య ఇంట్లో గురువారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు, ఇంట్లోని విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే సిరిసిల్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఏఎస్సై మోతీరామ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. ఇల్లు దగ్ధంపై గ్రామస్తులు పలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కరెంట్ కోతలు విధించొద్దు



మాట్లాడుతున్న పులి లక్ష్మీపతిగౌడ్

సిరిసిల్లటౌన్: వ్యవసాయానికి కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్లలో సంఘ్ సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీ చేయాలని, వ్యవసాయానికి ఇన్సూరెన్స్ కల్పించాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జోగినిపెల్లి సంపత్‌రావు, బియ్యంకార్ శ్రీనివాస్, ద్యాప దేవయ్య, శ్రీనివాస్‌రావు, పెద్దన్న, లక్ష్మారెడ్డి, పరుశురాములు పాల్గొన్నారు.

యువకుల 6కే పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సిరిసిల్లటౌన్: సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన శ్రీపెరంబదూర్ సాయివికాస్ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయం నుంచి అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయం వరకు 6కే పాదయాత్ర నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల వెంకన్న ఆలయం ముందు నుంచి కార్యక్రమాన్ని తెలంగాణ పవర్‌లూం, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా యువకుల ఉత్సాహం, అభిమానాన్ని అభినందించారు. సిరిసిల్ల పట్టణ ప్రధాన వీధుల నుంచి అగ్రహారం వరకు సాగిన పాదయాత్రలో వందలాదిగా యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ యువనాయకులు పత్తిపాక శివచరణ్, శ్రీరామ్, తాళ్లపల్లి అఖిల్‌గౌడ్, గాజుల సుమిత్, మనోజ్‌గౌడ్, రాకేశ్, దుర్గాప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

చెస్‌తో మేధస్సుకు పదును



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాలటౌన్: చెస్ మేధస్సుకు పదును పెడుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మంద మకరంద్ అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మహిళా చెస్ పోటీలను గురువారం జగిత్యాల మినీస్టేడియంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి బోనగిరి నరేశ్, పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీఈటీలు కృష్ణప్రసాద్, అంజయ్య, జమున, వెంకటలక్ష్మి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఉత్సాహభరితం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుధాకర్ పైప్స్ ప్రతినిధులు



జూనియర్ విభాగంలో ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల-మంచిర్యాల టీమ్‌కు బహుమతి ప్రదానం



సీనియర్ విభాగంలో వాగ్దేవి కళాశాల- మంచిర్యాల జట్టుకు బహుమతి ప్రదానం

- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజనల్ టోర్నమెంట్
- సీనియర్ విజేతగా మంచిర్యాల వాగ్దేవి, రన్నర్‌గా నిశిత డిగ్రీ కళాశాల
- జూనియర్ విజేతగా మంచిర్యాల ఎస్ఆర్ఆర్, రన్నర్‌గా నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నిజామాబాద్‌నాగారం: లక్ష్యాలను ఏర్పరచుకొని క్రీడల్లో కఠోరంగా సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజనల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'సాక్షి' సంస్థ క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. నగర ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో క్రీడలు చాలా అవసరమన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఏసీపీ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ రాజేశ్, సురేశ్, 'సాక్షి' బ్రాంచ్‌మేనేజర్ పల్లె మహేశ్, బ్యూరో ఇన్‌చార్జి తమ్మాటి భద్రారెడ్డి, సాక్షి ఈవెంట్స్ మేనేజర్ సుమన్, క్రికెట్ కోచ్ ఫారస్, గ్రౌండ్‌మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

విజేత జట్లు

- సీనియర్ విభాగంలో విన్నర్‌గా మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, రన్నర్ గా నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల
- జూనియర్ విభాగంలో విన్నర్‌గా ఎస్ఆర్ఆర్ మంచిర్యాల, రన్నర్‌గా నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఆరు పరుగుల తేడాతో..

సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, నిశిత డిగ్రీ కళాశాల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి వాగ్దేవి కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. సాయి వినయ్ 27, సాయికృష్ణ 19 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిశిత కళాశాల జట్టు 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. 6 పరుగుల తేడాతో మంచిర్యాల వాగ్దేవి కళాశాల జట్టు విన్నర్‌గా నిలిచింది.

అద్భుత ఇన్నింగ్స్‌తో..

జూనియర్ విభాగంలో ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి ఎస్ఆర్ఆర్ జట్టు 12 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. కృష్ణతేజ 24 పరుగులు చేశాడు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 12 ఓవర్లలో 65 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయ్యింది. ఎస్ఆర్ఆర్ మంచిర్యాల జట్టులో సంతోష్ హ్యాట్రిక్‌తో పాటు మొత్తం 4 వికెట్లు తీసుకుని మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

జట్టు విజయానికి హ్యాట్రిక్ ఉపయోగపడింది



ప్రత్యర్థి జట్టు నడ్డివిరవడానికి నేను తీసుకున్న నాలుగు వికెట్లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. హ్యాట్రిక్ తీయడం సంతోషంగా ఉంది. గతంలో కూడా టోర్నమెంట్‌లలో హ్యాట్రిక్ తీశాను. రీజనల్ స్థాయి పోటీల్లో నా బౌలింగ్ బాగా రావడానికి చాలా రోజుల నుంచి శ్రమించా. శ్రమకు తగిన ఫలితం లభించింది.

– సంతోష్, ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల

క్రీడాకారులను ప్రోత్సహించడానికే..



క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'సాక్షి' నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్ చేశాము. 'సాక్షి' ముందుండి వివిధ రకాల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. మా సంస్థ 'సాక్షి' క్రీడాకారులను ప్రోత్సహించే టోర్నమెంట్‌లకు సపోర్టుగా ఉంటుంది.

– రాజేష్, సుధాకర్‌పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్

'సాక్షి'కి ప్రత్యేక అభినందనలు



'సాక్షి' సంస్థ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌తో పాటు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. 'సాక్షి' చేస్తున్న కృషికి మా సంస్థ తరపున చిరుసాయం చేస్తున్నాం. ఇందుకు 'సాక్షి'కి ప్రత్యేకంగా అభినందనలు.

– సురేష్, సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

- వేడుకల్లో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్, జెడ్పీ చైర్‌పర్సన్లు..

సిరిసిల్ల: పట్టణంలోని విద్యానగర్ 3వ వార్డు అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ముందు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు.ఈ వేడుకల్లో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు జిందం కళా చక్రపాణి పూజలు చేశారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యానగర్ అభయాంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను సన్మానించి, అన్నదానం చేశారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యుడి ఉద్యోగ విరమణ



పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి కేటీఆర్

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు ఉద్యోగ విరమణ చేశారు. గురువారం మంత్రి కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిశారు. ఆయనకు మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలను తెలిపారు. చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ, వయసురీత్యా 22నెలల అనంతరం టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా ఉద్యోగ విరమణ పొందానన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల సహకారం, ప్రోత్సాహంతో టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా అవకాశం వచ్చిందన్నారు. వారి ఆకాంక్ష మేరకు తెలంగాణలో నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు అనేక నోటిఫికేషన్లు వేశామన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గ్రూప్ పోస్టుల భర్తీలో ప్రిలిమ్స్‌లో అవకాశాలు కల్పించి, మెయిన్స్‌కు ఎక్కువ మందిని పిలవడం దేశ చరిత్రలోనే మొదటిసారన్నారు. తన పదవీ కాలం అత్యంత సంతృప్తికరంగా సాగిందని ఆనందం వ్యక్తం చేశారు.

విద్యా ప్రమాణాలతో ఎంతో అభివృద్ధి

- విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట ..
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ..



స్నాక్స్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల/సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని, ఇందుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. ఇప్పటికే ఈ అంశంలో ఎంతో అభివృద్ధి సాధించామని రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల గీతానగర్ బాలికల జెడ్పీపాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పంపిణీచేశారు. పదోతరగతి పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ.. సిరిసిల్ల జిల్లాలోని 3,579 మంది విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, హెచ్‌ఎం భాగ్యరేఖ, ఎస్సెమ్సీ చైర్మన్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్లఅర్బన్: సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా డీవైఎస్‌వో ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి మహిళల చెస్‌పోటీలను గురువారం నిర్వహించారు. మొత్తం 24 మంది మహిళలు పాల్గొనగా మాస్టర్ మైండ్స్ పాఠశాల విద్యార్థిని ప్రనీశారెడ్డి ప్రథమస్థానం, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడేన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.స్వాతీ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు డీవైఎస్‌వో ఉపేందర్‌రావు సర్టిఫికెట్లు అందించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, పీఈటీలు ప్రభాకర్, బాబు, రవీంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పీఈటీలకు సమీక్ష నిర్వహించాలి

- డీఈఓకు ఉపాధ్యాయుల వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న పీఈటీలు

సిరిసిల్లఎడ్యుకేషన్: బోధనలో మెలకువలను ఓరియంటేషన్ శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అందిస్తున్నట్లుగానే పీటీలతో సమీక్షలు నిర్వహించాలని పీఈటీప బాధ్యులు డీఈవోకు గురువారం విన్నవించారు. నూతనంగా ఏర్పడిన అసోయేషన్ బాధ్యులు డీఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. పీఈటీలను అప్‌గ్రేడేషన్ చేయాలని, తమకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుప్పటి రవికుమార్, కార్యదర్శి కుంట శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ఎస్.శ్రీనివాస్, రాజు, పర్శరాం, టి.శ్యాంసుందర్, రాజశేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేపలపై విష ప్రయోగం?



వెంకటరాయుని చెరువులో మృతిచెందిన చేపలు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రం శివారు వెంకటరాయుని చెరువులో విషప్రయోగంతో చెరువులోని చేపపిల్లలు మృత్యువాతపడ్డాయి. వివరాల్లోకి వెళితే.. చెరువులో చేపలు పట్టే విషయంలో వీర్నపల్లి తండా గిరిజనులు, కంచర్ల గ్రామస్తుల మధ్య వివాదం నెలకొంటోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరువర్గాలతో మాట్లాడి వాటాల వారీగా చేపలు పట్టుకునేందుకు అనుమతించారు. వారి సమక్షంలోనే చేపలు పట్టుకున్నారు. లోతుగా ఉన్న ప్రాంతాల్లో తప్ప చెరువులోని నీటిని ఖాళీచేశారు. ఈ నేపథ్యంలో చెరువులో మిగిలిన చేపలపై కొంతమంది విషప్రయోగం చేయడంతో మృతిచెందాయి. రెండు గ్రామాల మధ్య నెలకొన్న చేపల వివాదమే ఈ విషప్రయోగానికి కారణమని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాదాయశాఖ మంత్రికి రాజన్న ప్రసాదం



మంత్రికి రాజన్న ప్రసాదం అందిస్తున్న నాయకులు

వేములవాడ: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి రాజన్న ప్రసాదాలను ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, సిరిగిరి శ్రీరాములు అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి జాతర ఉత్సవాలకు హాజరు కావాలని ఉద్యోగుల సంఘం పక్షాన ప్రత్యేకంగా ఆహ్వానించారు

రాళ్లపేట కంకర క్రషర్‌ను తొలగించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి
- రాళ్లపేట కంకర క్రషర్ సందర్శించిన జిల్లా సీపీఐ బృందం



రాళ్లపేటలో మాట్లాడుతున్న పంతం రవి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేట గ్రామశివారులో నిర్వహిస్తున్న కంకర క్రషర్‌ను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ జిల్లా బృందం ఆధ్వర్యంలో రాళ్లపేట కంకర క్రషర్‌ను మైనింగ్ ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. సర్వే నంబర్ 59లో ఇంటినంబర్‌తో 15 ఏళ్లుగా అక్రమంగా క్రషర్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. క్రషర్ సమీపంలో 100 వరకు తురక కాశి కుటుంబాలు నివసిస్తున్నాయని క్రషర్‌తో వచ్చే దుమ్ము, ధూళితో వారి ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. అయినప్పటికీ క్రషర్ యజమానులు పట్టించుకోవడం లేదని, క్రషర్ ప్రాంతంలో వ్యవసాయ భూములకు సంబంధించిన రైతులు కూడా క్రషర్ నిర్వహణతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు ఉన్నచోట కాకుండా వేరేచోట మైనింగ్‌కు పాల్పడుతున్న క్రషర్ యజమానులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. సహజ వనరులైన గుట్టలను మింగేస్తున్నారని.. క్రషర్‌లో పనిచేస్తున్న సుమారు 50 మంది కూలీలకు కనీస వసతులు కూడా కల్పించకుండా వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, మైనింగ్ శాఖ ఏడీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో క్రషర్ సమీపంలోని తురకాశి కుంటుంబాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాలుసాని పర్శరాములు, సీపీఐ జిల్లా బృందం సభ్యులు మంచికట్ల రమేశ్, మంత్రి చంద్రయ్య, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోకి చొరబడిన నాగుపాము

- పామును పట్టి బయటకు వదిలేసిన ఉపాధ్యాయుడు



పాఠశాలలో పామును పడుతున్న నరేశ్

కోనరావుపేట: మండలంలోని సుద్దాల ఉన్నత పాఠశాలలోకి ఓ నాగుపాము చొరబడింది. ఈ పామును చూసిన విద్యార్థులు భయంతో కేకలు వేశారు. విషయం తెలుసుకున్న పల్లిమక్త ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నరేశ్ వచ్చి నాగుపామును పట్టుకుని ఓ ప్లాస్టిక్ డబ్బాలో బంధించి ఊరి చివర చెరువుకట్ట వద్ద వదిలేశాడు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. పాములు ఎక్కడ కనబడినా వాటిని ఏమీ అనొద్దని తనకు సమాచారమిస్తే వాటిని పట్టి బయటపడేస్తానని పేర్కొన్నాడు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ భాషా

జగిత్యాల: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ యాస్మిన్ భాషా అన్నారు. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు నిర్వహించే ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన పెంచుకోవాలని, అపరిచితులు ఫోన్ చేస్తేస్పందించవద్దని, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖల ద్వారా ప్రతి నెలా ఖచ్చితంగా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కోట మధుసూదన్, యూబీఐ మేనేజర్లు శ్రీనివాసరావు, ముఖేశ్ పాల్గొన్నారు.

మహిళలకు విశిష్ట పురస్కారాలు

సిరిసిల్లకల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలకు విశిష్ట పురస్కారాలు ఇచ్చేందుకు స్త్రీ సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈమేరకు గ్రామ, మండలస్థాయిలో ఆయా రంగాల్లో రాణించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తెలిపారు. డిజిటల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఇక్వాలిటీ అంశంపై ఈసారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగే వేడుకల్లో స్త్రీ సాధికారత, సమానత్వంపై సదస్సులు, హింసకు వ్యతిరేకంగా సంక్షేమ యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన, చిత్రలేఖనం, ఉపన్యాసం, పాటలు, ముగ్గులు, కవితల పోటీల నిర్వహణ, లింగ సమానత్వంపై వర్క్‌షాప్, హింస రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.